సాక్షి

భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 19 । జూలై । 2023



రైళ్ల రద్దుతో సతమతం

జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లు నెలల తరబడి రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. 10లో



వైకుంఠధామాలు సూపర్

జిల్లాలోని మున్సిపాలిటీల పరిధిలో నిర్మించిన వైకుంఠధామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా చర్యలు తీసుకున్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 27° / 24°

జిల్లా వ్యాప్తంగా బుధవారం వర్షం కురుస్తుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయం.. రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. పునర్వసు నక్షత్రం సందర్భంగా పట్టాభిషేకం, అళ్వార్ తిరునక్షత్రోత్సవాల ప్రారంభం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): భారీ వర్షసూచన నేపథ్యంలో జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న మూడు రోజులపాటు జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించినట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరి అయితేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని కోరారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన 08744–241950 కంట్రోల్ రూం నంబర్‌కు కాల్ చేయాలని, ఇది 24 గంటలూ అందుబాటులో ఉంటుందని తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ శిరీష



ఆళ్లపల్లి పీహెచ్‌సీలో మందులు పరిశీలిస్తున్న శిరీష

గుండాల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వాస్పత్రుల్లో మలేరియా, డెంగీ, ర్యాపిడ్ ఫీవర్ టెస్టులు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌ఓ శిరీష అన్నారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లోని పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. పీహెచ్‌సీలలో అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతీ ఒక్కరినీ పరీక్షించాలని సిబ్బందికి సూచించారు. మర్కోడు సబ్ సెంటర్‌లో తాగునీరు, విద్యుత్ సరఫరాకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలందించాలని చెప్పారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మనీష్‌రెడ్డి, రేవంత్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఎఫ్‌ఓ



డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్

చుంచుపల్లి: జిల్లా అటవీశాఖ అధికారిగా కిష్టాగౌడ్ మంగళవారం వన విహార్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డీఎఫ్‌ఓ లక్ష్మణ్ రంజిత్ నాయక్ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన కిష్టాగౌడ్‌ను పలువురు ఎఫ్‌డీఓలు, డీఆర్వోలు, ఎఫ్ఆర్వోలు, ఎఫ్ఎస్ఓలు, బీట్ ఆఫీసర్లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. బదిలీపై వెళ్తున్న రంజిత్‌నాయక్‌కు కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, యూనియన్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రమాదంలో మరణించిన బీట్ ఆఫీసర్ మోతీలాల్ కుటుంబ సభ్యులకు ఫారెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సేకరించిన నగదు రూ.3.50 లక్షలు సీసీఎఫ్ భీమానాయక్ చేతుల మీదుగా అందజేశారు.

ఆకాశయానం

అందని ద్రాక్షేనా?



ఆకాశయానం జిల్లా ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. పదిహేనేళ్లుగా ఇదుగో అదుగో అంటూ ప్రకటనలు చేయడం, ఆపై సర్వేలు అంటూ హడావుడి చేయడం మినహా ఎయిర్ పోర్టు నిర్మాణం విషయంలో అడుగు ముందుకు పడటం లేదు.



పాల్వంచ పట్టణ పరిధిలోని బంగారుజాలలో విమానాశ్రయం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

పదిహేనేళ్లుగా ఊరిస్తున్న ప్రతిపాదనలు

- పాల్వంచ బంగారుజాలలో స్థలం గుర్తింపు
- డీజీసీఏ పరిశీలనలోనూ ఎయిర్‌పోర్టు అంశం
- రెండేళ్లుగా ఉలుకూపలుకూ లేని వైనం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు కొత్తగా ఎనిమిది విమానాశ్రయాలు నిర్మించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ సమయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఎంపీగా గెలిచిన రేణుకాచౌదరి కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఆమె చూపిన చొరవతో కొత్త ఎయిర్‌పోర్టుల ప్రతిపాదనల్లో కొత్తగూడెం పేరు కూడా చేరింది. అయితే గత 15 ఏళ్లుగా ఎయిర్‌పోర్టు అంశం విక్రమ్ బేతాళ్ కథలా మారిపోయింది. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్ట్ నిర్మాణాన్ని పరిశీలిస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటనలు చేస్తాయి. ఆ తర్వాత విడతల వారీగా నిపుణుల బృందాలు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తాయి. వారి సూచనలకు అనుగుణంగా, జిల్లా యంత్రాంగం ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం సర్వేలు చేపడతాయి. పూర్తి స్థాయిలో నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతాయి. అంతే ఇక ఆ తర్వాత ఉలుకూపలుకూ ఉండదు. మూడుసార్లు ప్రభుత్వాలు మారినా ఇదే పరిస్థితి పునరావృతం అవుతోంది.

విమానాశ్రయం ముచ్చట సాగిందిలా..

- కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి 2008లో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. నాటి నుంచి 2014 వరకు కాగితాల్లో ప్రతిపాదనలే తప్ప క్షేత్ర స్థాయిలో అంగుళం పని కూడా జరగలేదు.
- తెలంగాణ ఏర్పాటు తర్వాత సీఎం కేసీఆర్ విజ్ఞప్తి మేరకు అప్పటి కేంద్ర విమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు ఎయిర్‌పోర్టు పనుల్లో దూకుడు పెంచారు.
- ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూముల కోసం 2015 జనవరి నుంచి 2017 మార్చి వరకు అన్వేషణ సాగింది.
- పాల్వంచ మండలం పునుకుడుచెలక దగ్గర 1600 ఎకరాల స్థలాన్ని ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అనువైనదిగా గుర్తించారు.
- ఈ స్థలాన్ని తమకు అప్పగిస్తే నిర్మాణ పనులు ప్రారంభిస్తామని 2017 మార్చిలో కేంద్ర విమానయాన శాఖ తెలిపింది.
- పునుకుడుచెలక దగ్గరున్న స్థల సేకరణకు పర్యావరణ, అటవీశాఖ, వన్యప్రాణి సంరక్షణ, సుప్రీంకోర్టు నిబంధనలు అడ్డొచ్చాయి. దీంతో ఆ ప్రతిపాదనలు అటకెక్కాయి.
- 2019లో పాల్వంచ మండలంలో సర్వే నంబర్ 441లో ఉన్న 700 ఎకరాల స్థలాన్ని పరిశీలనలోకి తీసుకున్నారు. శ్రీనివాసకాలనీ నుంచి బంగారుజాల వరకు ఉన్న భూములను ఎంపిక చేసి 2020లో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) పరిశీలనకు పంపారు.
- విమానాలు ల్యాండ్, టేకాఫ్ అయ్యేందుకు బంగారుజాల దగ్గరున్న స్థలం అనువైనదా, కాదే అనే అంశాలను ఏఏఐ బృందం 2021లో పరిశీలించింది. ఆ తర్వాత ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన శాఖాపరమైన అనుమతుల కోసం డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ)కు ప్రతిపాదనలు వెళ్లాయి. కానీ అప్పటి నుంచి ఎయిర్‌పోర్టు పనులు ముందుకు సాగలేదు.

పక్కన పడేస్తున్నారు

రాష్ట్రంలో కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై గతేడాది ఆగస్టులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంప్రదింపులు జరిగాయి. ఇందులో వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్, నిజామాబాద్ (జక్రాన్‌పల్లి) ఎయిర్‌పోర్టుల ప్రస్తావనే వచ్చింది తప్పితే కొత్తగూడెం ఊసే లేదు. అప్పటి వరకు తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టుల ప్రస్తావన ఎప్పుడొచ్చినా కొత్తగూడెం పేరు తప్పకుండా ఉండేది. మరోవైపు విమాన ప్రయాణ, రవాణా సౌకర్యం లేని మారుమూల ప్రాంతాలకు సైతం ఆకాశయానం అవకాశం కల్పించేందుకు కేంద్రం ఉడాన్ (ఉడే దేశ్‌కి ఆమ్ నాగరిక్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇక్కడ కూడా కొత్తగూడెం పేరు లేకపోవడం గమనార్హం.

దృష్టిపెట్టండి..

పారిశ్రామికంగా, ఆధ్యాత్మికంగా భద్రాద్రి జిల్లాకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే దేశ నలుమూలల నుంచి పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. ఇక ఆకాశయాన సౌకర్యం లేక సింగరేణి, థర్మల్ విద్యుత్ కేంద్రాలు, హెవీ వాటర్ ప్లాంట్, పేపర్‌బోర్డు తదితర పరిశ్రమల్లో పనిచేసే ఉన్నతాధికారులు, నిపుణులు ఇప్పటికే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జిల్లా అభివృద్ధి ముఖ చిత్రాన్ని మార్చే ఎయిర్‌పోర్టు నిర్మాణంపై అవసరమైన దృష్టిపెట్టడం లేదనే అపవాదును జిల్లా ప్రజాప్రతినిధులు మూటగట్టుకున్నారు. ఇప్పటికైనా ఎయిర్‌పోర్టు నిర్మాణంలో కదలిక వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సంయుక్తంగా కృషి చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

పేదరికం తగ్గుముఖం

- నివేదిక వెల్లడించిన నీతి ఆయోగ్
- జిల్లాలో మెరుగు పడుతున్న జీవన ప్రమాణాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం : బహుళముఖ పేదరిక సూచీలకు సంబంధించి నీతి ఆయోగ్ తాజాగా వెల్లడించిన వివరాల్లో జిల్లాలోని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నట్టు వెల్లడైంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పోల్చినా, సారూప్యత ఉండే గోదావరి పరీవాహక ప్రాంతాల జిల్లాలతో సరిచూసినా పేదరిక నిర్మూలనలో భద్రాద్రి ముందంజలో ఉంది. గ్రాండ్ ఓల్డ్ మ్యాన్ ఆఫ్ ఇండియా, ఆర్థిక శాస్త్రంలో దిట్టగా పేరొందిన దాదాభాయ్ నౌరోజీ బ్రిటిష్ పాలనా కాలంలోనే పేదరికాన్ని లెక్కించే విధానాన్ని అందుబాటులోకి తెచ్చారు. తద్వారా సరైన జీవన ప్రమాణాలు సాధించడంలో సమాజంలో వివిధ వర్గాలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించడం, వాటికి పరిష్కార మార్గాలు చూపించడం ఈ నివేదిక ముఖ్య ఉద్దేశం. ఈ నివేదికలో పేర్కొన్న అంశాలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల రూపొందించే పథకాల్లో కీలక పాత్ర పోషిస్తాయి.

12 అంశాల్లో..

నేషనల్ మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ – 2023 వివరాలను నీతి ఆయోగ్ మంగళవారం విడుదల చేసింది. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో వివరాలను సేకరించి, వాటిని మదించి ఈ రిపోర్టు సిద్ధం చేసింది. ఇందులో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు వంటి ప్రధాన అంశాల్లో 12 ఉప అంశాలకు సంబంధించిన డేటా ఆధారంగా పేదరికం సూచీలు నిర్ణయించారు. ఇందులో బ్యాంక్ అకౌంట్ మొదలు పౌష్టికాహారం వరకు కీలక అంశాల్లో ప్రజలకు ప్రభుత్వం తరఫున అందుతున్న సేవలను పరిగణనలోకి తీసుకున్నారు.

సంక్షేమ పథకాల ఫలితమే..

జిల్లాల విభజనకు ముందు విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు ఇలా అనేక విభాగాల్లో పేదరికాన్ని అనుభవిస్తున్న వారి సంఖ్య జిల్లా జనాభాలో 13.75 శాతంగా ఉండేది. ఇందులో సగానికి పైగా అంటే దాదాపు 8 శాతానికి పైగా గ్రామీణ, అటవీ ప్రాంతం ఎక్కువగా ఉన్న ప్రస్తుత భద్రాద్రి జిల్లా పరిధిలోనే పేదరికం ఎక్కువగా ఉండేది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత 2018 నుంచి 2021 వరకు సేకరించిన డేటాను విశ్లేషించగా పేదరికం 4.33 శాతానికే పరిమితమైంది. ఇటీవల కాలంలో మిషన్ భగీరథ, కేసీఆర్ కిట్లు, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు, అంగన్‌వాడీలు, పాఠశాలల ద్వారా పౌష్టికాహారం తదితర పథకాలు గత నాలుగేళ్లుగా లబ్ధిదారులకు చేరడం ఎక్కువైంది. దీంతో పేదరికం తగ్గుముఖం పట్టినట్టు విశ్లేషకుల అంచనా.

గోదావరి బెల్ట్‌లో ఇలా..

2018–19 డేటా ఆధారంగా గోదావరి పరీవాహక జిల్లాల్లో పేదరికం వివరాలిలా ఉన్నాయి. జయశంకర్ భూపాలపల్లి 6.33 శాతం, పెద్దపల్లి 2.17 శాతం, మంచిర్యాల 4.43 శాతంగా ఉన్నాయి. ఈ జిల్లాల్లో ప్రభుత్వ పథకాలకు తోడు పారిశ్రామికీకరణ ఎక్కువగా ఉండడంతో ఇతర జిల్లాలతో పోల్చితే పేదరికం తక్కువగానే ఉంది.

పెరుగుతున్న గోదావరి



భద్రాచలం వద్ద గోదావరి



తాలిపేరు నుంచి విడుదలవుతున్న నీరు

- ఎగువ ప్రాంతాల నుంచి 20 టీఎంసీల నీరు విడుదల
- నేడు నీటిమట్టం మరింతగా పెరిగే అవకాశం

భద్రాచలం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి పెరుగుతోంది. మంగళవారం ఉదయం 14.6 అడుగులుగా ఉన్న నీటిమట్టం రాత్రి 8 గంటల వరకు 20.5 అడుగులకు చేరుకుంది. భద్రాచలానికి ఎగువన ఉన్న మేడిగడ్డ బ్యారేజ్ నుంచి 16 టీఎంసీలు, సమ్మక్క సారక్క బ్యారేజీ నుంచి 3.5 టీఎంసీల నీటిని విడుదల చేయగా, అది గోదావరిలో కలుస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంతో చర్ల మండలంలోని తాలిపేరుకు భారీగా నీరు రావడంతో 22 గేట్లు ఎత్తి 26,558 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకే వదిలారు. దీంతో మొత్తంగా సుమారు 20 టీఎంసీల నీరు నదిలో కలిసే అవకాశం ఉంది. ఈ లెక్కన భద్రాచలం వద్ద బుధవారం తొలిసారిగా అధిక నీటిమట్టం నమోదయ్యే అవకాశం ఉందని, 25 అడుగులకు పైగా చేరుకుంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే భద్రాచలంలో గోదావరి నీరు స్నానఘట్టాల వరకు చేరుకుంది. దీంతో ముందస్తుగా స్లూయిజ్‌ల వద్ద మోటార్లను సిద్ధం చేయాలని స్థానికులు కోరుతున్నారు. విస్తా కాంప్లెక్స్, కొత్త కాలనీ, రాఘవ నిలయం, సుభాష్‌నగర్ ప్రాంతాల్లోని స్లూయిజ్‌లు లీక్ కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. కాగా, తాలిపేరులో బుధవారం సైతం నీటి ఉధృతి కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రెండు రోజుల పాటు భారీ వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో బుధ, గురువారాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ వి.లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ పర్యవేక్షకులు ఎం. సుమన్ తెలిపారు. వర్షాధార పంటలైన పత్తి, జొన్న, మొక్కజొన్న, కంది, వేరుశనగ, పెసర, మినుము తదితర చేలల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. రసాయన ఎరువులు వేయడం, పురుగుమందులు, కలుపు నివారణ మందుల పిచికారీని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని తెలిపారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని కోరారు. వీలైనంత వరకు పశువులను షెడ్ల కిందనే ఉంచాలని సూచించారు. విద్యుత్ స్తంభాలు ముట్టుకోవడం, విద్యుత్ పరికరాలను తాకడం వంటివి చేయవద్దని తెలిపారు.

ముగ్గురు సీఐల బదిలీ

కొత్తగూడెంటౌన్: జిల్లాలో ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అశ్వాపురం సీఐ సీహెచ్.శ్రీనివాస్‌ను హైదరాబాద్‌లోని ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేయగా, సీసీఎస్ ములుగు నుంచి జి.రవిందర్‌ను అశ్వాపురం పంపించారు. ఆశ్వారావుపేట సీఐ బొమ్మెర బాలకృష్ణను ఐజీ ఆఫీస్ హైదరాబాద్‌కు అటాచ్ చేయగా, ఖమ్మం జిల్లా సత్తుపల్లి సీఐ టి.కరుణాకర్‌ను ఆశ్వారావుపేటకు బదిలీ చేశారు. జూలూరుపాడు సీఐ ఇ.శ్రీనివాస్‌ను పీసీఆర్ మహబూబాబాద్‌కు బదిలీ చేశారు.

కలప వేలంతో రూ.26 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న అటవీశాఖ అధికారులు

భద్రాచలంటౌన్: టేకు కలప వేలంతో ప్రభుత్వానికి ఈ ఏడాది రూ.26 లక్షల ఆదాయం సమకూరినట్లు భద్రాచలం ఇన్‌చార్జ్ ఎఫ్‌డీఓ మధుసూద్ తెలిపారు. భద్రాచలం అటవీ శాఖ కార్యాలయంలోని కలప డిపోలో మంగళవారం టేకు కలప వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం కలప డిపోలో ప్రస్తుతం దుమ్ముగూడెం మండలంలో అటవీశాఖ ఆధ్వర్యంలో సుమారు 30 ఏళ్లుగా సంరక్షించిన విలువైన టేకు కలప వేలం వేశామని తెలిపారు. 22 లాట్లు అమ్ముడుపోగా ప్రభుత్వానికి రూ.26 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ప్రసాద్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి

పంచాయతీ అధికారులకు డీపీఓ, డీఆర్డీఓ ఆదేశం



కంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీఆర్డీఓ, డీపీఓ

పాల్వంచరూరల్ : గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె చేస్తున్న నేపథ్యంలో పంచాయతీల్లో అదనపు సిబ్బందిని నియమించి పారిశుద్ధ్య లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీఓ మధుసూదన్ రాజు, డీపీఓ ఎల్.లక్ష్మీరమాకాంత్ పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని నాగారం గ్రామాన్ని మంగళవారం వారు తనిఖీ చేశారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిత్యం తడిచెత్త, పొడిచెత్త సేకరించాలని, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. కంపోస్టు ఎరువును ఉత్పత్తి చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కల చుట్టూ గుంతలు తీసి భూమిలోకి నీరు ఇంకేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రతి ఇంటికీ ఆరు మొక్కలు పంపిణీ చేసి, సంరక్షించేలా యజమానులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లోనూ మొక్కలు నాటించాలన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి బొగ్గా నారాయణ, కార్యదర్శి రాధిక పాల్గొన్నారు.

‘నులి’పేద్దాం రండి!

- రేపు నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం
- 1–19 ఏళ్ల లోపు వారికి అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- జిల్లా వ్యాప్తంగా 3,36,136 మంది విద్యార్థులు, చిన్నారుల గుర్తింపు..



భద్రాచలంఅర్బన్: చిన్నపిల్లల్లో పౌష్టికాహార లోపం, రక్తహీనతకు కారణమయ్యే నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపడుతోంది. ఇందుకోసం 19 ఏళ్ల లోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నారు. చిన్నారుల్లో పౌష్టికాహార లోపం, కడుపు నొప్పి, రక్తహీనతకు నులిపురుగులు కారణమవుతుంటాయి. అవి పేగుల్లో తిష్టవేసి ఆహారంలోని పోషకాలను గ్రహిస్తూ నెమ్మదిగా వృద్ధి చెందుతాయి. వీటిలో నులిపురుగులు, ఏలికపాములు, నట్టలు అనే రకాలు ఉంటాయి. వీటి నివారణకు చిన్నారులు, కిశోర బాలలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 20, 27 తేదీల్లో నిర్వహిస్తున్నారు. 20న మాత్రలు వేసుకోకుండా మిగిలిన పోయిన వారికి 27వ తేదీన వేస్తారు. జిల్లావ్యాప్తంగా అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చిన్నారులు, బాలలకు మాత్రలు వేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

జిల్లాలో 3,36,136 మందికి..

జిల్లా వ్యాప్తంగా గల 38 ఆరోగ్య కేంద్రాల పరిధిలో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారు. అంతేగాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీలకు వెళ్లి అందజేస్తారు. జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు, 1676 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, 88 ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు, 86 ట్రైబల్ వెల్ఫేర్, 30 సోషల్ వెల్ఫేర్, 27 టెక్నికల్ ఎడ్యుకేషన్, 17 బీసీ వెల్ఫేర్, 12 మైనారిటీ ఇలా మొత్తంగా 1754 పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు పంపిణీ చేస్తారు. జిల్లాలో 3,36,136 మంది చిన్నారులు, బాలలను గుర్తించారు. మాత్రల పంపిణీ కోసం జిల్లాలోని 240 సబ్ సెంటర్ల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 440 మంది ఏఎన్ఎంలు, 1420 మంది ఆశా కార్యకర్తలను కేటాయించారు.

పరిశుభ్రతే ప్రధానం..

అపరిశుభ్రతతోనే నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తుంటాయి. చిన్నారులు మట్టిలో ఆడడం, అదే చేతులతో ఆహార పదార్థాలు తినడం వంటివి చేస్తుంటారు. దీంతో మట్టిలో ఉన్న నులిపురుగులు పేగుల్లోకి చేరుతాయి. పేగుల్లో ఉన్న ఆహారంలోని పోషకాలను గ్రహిస్తూ క్రమంగా వృద్ధి చెందుతాయి. దీంతో చిన్నారుల్లో రక్తహీనత ఏర్పడుతుంది. నులిపురుగులు పెరిగి కడుపునొప్పి, వాంతులు, విరేచనాలకు దారితీస్తుంది. చేతులను, గోర్లను శుభ్రం చేసుకునేలా, పరిశుభ్రమైన నీటిని తాగేలా వారికి చిన్నతనం నుంచే నేర్పించాలి.

దీర్ఘకాలిక వ్యాధులుంటే వేయరు

దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి, ఇతర మందులు వాడుతున్న వారికి, ఫిట్స్ ఉన్న వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయొద్దని అధికారులు వైద్య సిబ్బందికి సూచించారు. మిగతా వారిలో మందులు వేసిన తర్వాత ఏమైనా దుష్ఫలితాలు కనిపిస్తే మండల వైద్యాధికారులను సంప్రదించాలని తెలిపారు. వైద్య శాఖ మార్గదర్శకాల ప్రకారం 1 నుంచి 19 ఏళ్ల లోపు వారికి ఈ మాత్రలు వేస్తారు. 1–3 ఏళ్ల లోపు చిన్నారులకు సగం మాత్రను పొడి చేసి నీటిలో కలిపి తాగిస్తారు. 3–19 ఏళ్ల లోపు చిన్నారులు, కిశోర బాలలకు పూర్తి మాత్రను ఇచ్చి నమలమని చెబుతారు. మాత్ర వేసిన తర్వాత అతికొద్ది మందిలో స్వల్ప దుష్ఫలితాలు కన్పిస్తాయని, దీనికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు చెబుతున్నారు.

స్కూళ్లు, కాలేజీల్లోనే..

స్కూళ్లు, కాలేజీల నుంచి వైద్యశాఖాధికారులు విద్యార్థుల జాబితా తెప్పించుకుని దానికి తగ్గట్టుగా మందులు అందుబాటులో ఉంచారు. మాత్రల పంపిణీ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధానాలపై అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

ఏర్పాట్లు పూర్తి..



చిన్నారుల్లో రక్తహీనత, పౌష్టికాహార లోపాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలు, స్కూళ్లు, కాలేజీల్లో చిన్నారులు, కిశోర బాలలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయడంపై వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించాం. జిల్లాలో 3,36,136 మంది చిన్నారులను గుర్తించాం. దీర్ఘకాలిక వ్యాధులు, జ్వరం, ఫిట్స్ ఉన్నవారిని మినహాయించి 1–19 ఏళ్ల లోపు ప్రతీ ఒక్కరికి మాత్రలు వేయాలి. ఈ విషయంలో తల్లిదండ్రులు చొరవ తీసుకోవాలి.

– బాలాజీనాయక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి

క్లుప్తంగా

కామర్స్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల గ్రామంలో ఉన్న తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో కామర్స్ లెక్చరర్ల పోస్టులను పార్ట్‌టైం పద్ధతిలో భర్తీ చేయనుండగా అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. కామర్స్ సబ్జెక్ట్‌లో పీజీతో పాటు పీహెచ్‌డీ అర్హత కలిగి ఉండి సెట్, నెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇద్దరు లెక్చరర్లకు అవకాశం ఉండగా, రెండేళ్ల బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ఆసక్తి, అర్హతలు గల వారు నేరుగా కళాశాలలో సంప్రదించాలని, వివరాలకు 94910 63083 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

భద్రాచలం ఎమ్మెల్యేపై బీఆర్‌ఎస్ నాయకుల ఫిర్యాదు



సీఐ నాగరాజుకు ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

భద్రాచలం: భద్రాచలం నియోజకవర్గంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు ఒకరిపైఒకరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎన్నో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా భద్రాచలం ప్రజలను మోసం చేశారంటూ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎమ్మెల్యే పొదెం వీరయ్య ఫిర్యాదు చేశారు. దీనిని వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు భద్రాచలం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ఎమ్మెల్యే పొదెం వీరయ్య మోసం చేశారంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ సెంటర్‌లో పొదెం వీరయ్య దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో అరికెళ్ల తిరుపతిరావు, కొండిశెట్టి కృష్ణమూర్తి, బోదబోయిన బుచ్చయ్య, నక్కా ప్రసాద్, చింతాడి చిట్టిబాబు, మల్లా రాంబాబు, మామిడి పుల్లారావు, చింతాడి రామకృష్ణ, ఎల్‌వీ తదితరులు పాల్గొన్నారు.

సర్వే పత్రాలు ఇవ్వండి..

మణుగూరురూరల్: పోడుభూముల హక్కు పత్రాలు రాని ఆదివాసీ గిరిజన రైతులు.. తమ సర్వే రశీదులను మణుగూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఇవ్వాలని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పినపాక నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో అర్హులైన గిరిజన పోడు రైతులందరికి హక్కు పత్రాలు అందజేశామని, సర్వే జరిగి హక్కు పత్రాలు రాని రైతులు తమ సర్వే రశీదులను అందజేస్తే.. పరిశీలన తర్వాత పట్టాలు ఇస్తామని పేర్కొన్నారు.

ఆర్డీఓకు ముంపు బాధితుల వినతి




వినతిపత్రం ఇస్తున్న ముంపు బాధితులు

భద్రాచలంఅర్బన్: అశోక్‌నగర్ కొత్తకాలనీ కరకట్ట వద్ద పక్కా ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, 2013 పునరావాస చట్టం ప్రకారం నష్టపరిహారం ప్యాకేజీ ఇవ్వాలని 18 కుటుంబాలకు చెందిన బాధితులు ఆర్డీఓ రత్నకల్యాణికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టా భూమిలో పక్కా ఇళ్లు నిర్మించుకొని 25 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, గోదావరి ముంపు పేరుతో ఎలాంటి నష్ట పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేసి ప్రభుత్వం ఇచ్చే గృహాలకు వెళ్లాలని చెబుతున్నారని తెలిపారు. స్పందించిన ఆర్డీఓ ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మర్లపాటి రేణుక, లక్ష్మీకాంత్, నరసింహారావు, నరేశ్, రేవతి, వెంకటేశ్వర్లు, ప్రసాద్, విజయ్, నరసింహారావు, గుంజ చెన్న కేశవులు, శ్రీను వాసు, రాయల రాములు, రవి, కష్టార్జున్‌రావు, ప్రేమ్, సాయి, ఆదినారాయణ, మనోజ్‌రెడ్డి, భాగ్యమ్మ, సుశీల, నరసమ్మ, స్వామి, వెంకటరెడ్డి, రామారావు, లీలావతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఎంఈఓకు గాయాలు

జూలూరుపాడు: కుక్కల దాడిలో ఎంఈఓ గుగులోత్ వెంకట్, ఐఈఆర్‌పీ ఆర్.సాంబశివరావు గాయపడ్డారు. మంగళవారం మండల కేంద్రం నుంచి వెనకతండా ప్రాథమిక పాఠశాలను సందర్శించేందుకు బైక్‌పై ఎంఈఓ వెంకట్, ఐఈఆర్‌పీ సాంబశివరావు వెళ్తున్నారు. మార్గమధ్యలో జడలచింతలో కుక్క పిల్ల పరుగెత్తుకుంటూ వచ్చి బైక్ కిందపడింది. ఆ కుక్కపిల్ల అరవడంతో మూడు వీధి కుక్కలు ఒక్కసారిగా బైక్‌పై ఉన్న ఎంఈఓ, ఐఈఆర్‌పీపై దాడి చేశాయి. దీంతో వారిద్దరికీ గాయాలయ్యాయి. వారు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లి వ్యాక్సిన్ వేయించుకున్నారు. కాగా, వీధికుక్కలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

వైకుంఠ ధామాల నిర్మాణం సూపర్..

- రూ.కోటి నిధులతో నిర్మాణాలు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఇబ్బందులు..
- మరూ కాని శ్మశాన వాటికలు

పాల్వంచ: ఒకప్పుడు శ్మశాన వాటికలు అంటే ఊరికి దూరంగా ఉండేవి. అక్కడ ఎక్కువ సేపు ఉండేందుకు కూడా ప్రజలు సాహసించేవారు కాదు. చనిపోయిన వారికి అంత్యక్రియలు చేయాలంటే నానా హైరానా పడాల్సి వచ్చేది. ఇక వర్షాకాలంలో పరిస్థితి ఇంకాస్త ఇబ్బందికరంగా ఉండేది. సీఎం కేసీఆర్ పట్టణాలు, గ్రామాల్లో వైకుంఠధామాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. మున్సిపాలిటీల్లో వైకుంఠధామాలకు ప్రత్యేక నిధులు కేటాయించి మెరుగులు దిద్దారు. వైకుంఠధామాల్లో ఆహ్లాదకర వాతావరణం ఉట్టిపడేలా గట్టి చర్యలు తీసుకున్నారు. రూ.కోటి నిధులతో నిర్మాణాలను చేశారు.

అనేక వసతులు..

జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల్లో మొత్తం ఆరు వైకుంఠధామాల నిర్మాణానికి 2021లో నిధులు మంజూరయ్యాయి. స్పెషల్ గ్రాంట్ నిధులు రూ.కోటి చొప్పున ఒక్కో వైకంఠధామానికి వెచ్చించారు. పాల్వంచలో శ్రీనివాసకాలనీ, కేసీఆర్‌నగర్, కొత్తగూడెంలో సింగరేణి హెడ్డాఫీస్ ఏరియా, గొల్లగూడెం, ఇల్లెందు, మణుగూరులో నిర్మాణాలను పూర్తిచేశారు. బర్నింగ్ ప్లాంట్, బర్నింగ్ ప్లాట్, సిట్టింగ్ గ్యాలరీ, దింపుడు గల్లం, పూజ గది, ఆఫీస్ గది, బూడిద భద్రపర్చే గది, ఉడ్ స్టోరేజీ, మహిళలు, పురుషులకు వేర్వేరుగా స్నానపు గదులు, దుస్తులు మార్చుకునే గదులు, బాత్ రూంలు, మండపం, ప్రహరీ, ఆర్చ్, వాచ్‌మెన్ గదులు, శివుడి విగ్రహం, ఇంటర్నల్ రోడ్లు, గార్డెన్‌లు, లాన్, పూల మొక్కలు, నీటి వసతి ఇలా అనేక రకాల వసతులతో తీర్చిదిద్దారు. పాల్వంచలోని శ్రీనివాసకాలనీ వైకుంఠధామంలో పచ్చదనం ఎంతో ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దారు. గత ఫిబ్రవరిలో గత కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ సందర్శించి ప్రశంసించారు. ఇల్లెందు, మణుగూరులో కొంత భాగం గ్రీనరీ పనులు పెండింగ్‌లో ఉన్నాయి.



నిర్మాణం పూర్తయిన శ్రీనివాసకాలనీలోని వైకుంఠధామం, (ఇన్‌సెట్) వైకుంఠధామంలోని పచ్చని మొక్కలు

నిధులు విడుదల కాక ఇబ్బంది..

రూ.కోటి నిధులతో కాంట్రాక్టర్‌లు వైకుంఠధామాలను తీర్చిదిద్దారు. దాదాపు అన్నిచోట్ల నిర్మాణం తుది దశలో ఉంది. కొత్తగూడెం, పాల్వంచలో నిర్మాణం పూర్తయినా వైకుంఠ ధామాలు ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఇల్లెందు, మణుగూరులో కూడా ప్రారంభించాల్సి ఉంది. స్పెషల్ గ్రాంట్ నిధులు విడుదల కాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు.

సకల సౌకర్యాలతో సిద్ధం..



అన్ని వసతులతో వైకుంఠధామాల నిర్మాణాలు పూర్తిచేశాం. స్పెషల్ గ్రాంట్ రూ.కోటితో అంత్యక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించుకునేందుకు అన్నిరకాల వసతులు ఏర్పాటు చేశాం. బిల్లులు పెండింగ్‌లు ఉన్నాయి. వాటి కోసం ట్రెజరీకి పంపించాం. త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. స్థానిక ఎమ్మెల్యేతో వైకుంఠధామాలను త్వరలోనే ప్రారంభిస్తాం.

–సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్

పాల్వంచ: ప్రస్తుత సమాజంలో యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్‌ను పాడు చేసుకుంటున్నారని పాల్వంచ డీఎస్పీ వెంకటేశ్ అన్నారు. మంగళవారం స్థానిక కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'మత్తు పదార్థాలు – దుష్పరిణామాలు'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించగా డీఎస్పీ పాల్గొని మాట్లాడారు. సిగరెట్, మందు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిస కావడమే గాక ఫ్యాషన్‌గా భావిస్తున్నారన్నారు. యవ్వనంలో మత్తు పదార్థాలకు బానిసలైతే ఆ ప్రభావం కుటుంబం, సమాజంపై పడుతుందని, జల్సాల మోజులో పడి యువకులు తమ ఆరోగ్యం, కుటుంబం పరువు, దేశ భవిష్యత్‌ను గాలికి వదిలేస్తున్నారని చెప్పారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో మెలుగుతూ కేవలం విద్యపైనే దృష్టి సారించి, ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ వినయ్‌కుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సురేంద్రకుమార్, మిమిక్రీ రమేశ్ పాల్గొన్నారు.

సెలవులకు వచ్చాడు.. శవమై మిగిలాడు..

కట్లపాము కాటుతో పదో తరగతి విద్యార్థి మృతి



భరత్ (ఫైల్)

టేకులపల్లి: రెండు రోజులు సెలవు రావడంతో ఇంటికి వచ్చిన పదో తరగతి విద్యార్థి పాముకాటులో మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని తడికలపూడి పంచాయతీ పాతతడికలపూడి గ్రామానికి చెందిన కల్తీ కోటయ్య, ముత్తమ్మ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పెద్ద కుమారుడు సందీప్ దమ్మపేట గురుకులంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రెండో కుమారుడు భరత్ (15) పాల్వంచ గురుకులంలో పదో తరగతి చదువుతున్నాడు. ఆది, సోమ రెండు రోజులు సెలవులు రావడంతో భరత్ శనివారం సాయంత్రం ఇంటికి వచ్చాడు. సోమవారం రాత్రి గుడిసెలో కుటుంబ సభ్యులు ముగ్గురూ నేలపై పడుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు నిద్ర లేచేసరికి ఇంటి గడప వద్ద కట్ల పాము కనిపించగా స్థానికుల సాయంతో చంపారు. సుమారు 7 గంట ల సమయంలో భరత్‌ని నిద్ర లేపేందుకు యత్నించగా నోట్లో నురుగు వస్తుండటంతో పరిశీలించగా చెవి దగ్గర గాట్లు కనిపించాయి. ఉదయం వారు చంపిన కట్ల పాము కరిచినట్లుగా భావించి సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం కొత్తగూడెం ఏరియాస్పత్రికి తరలించారు. అక్కడ భరత్ మృతి చెందాడు. భరత్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

టెంట్ వాడుకుని డబ్బులు ఇవ్వలేదని..

జీపీ కార్యాలయం ఎదుట టెంట్ దహనం



టెంట్‌ను దహనం చేస్తున్న రవి

టేకులపల్లి: టెంట్ వాడుకుని డబ్బులు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహిస్తూ అదే టెంటును జీపీ కార్యాలయం ఎదుట దహనం చేశాడో బాధితుడు. ఈ ఘటన మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని బేతంపూడిలో సీహెచ్ రవి కొన్నేళ్లుగా టెంట్‌హౌజ్ నిర్వహిస్తున్నాడు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామసభలు, కంటివెలుగు, ఎమ్మెల్యే ఆధ్వర్యంలో జరిగిన పోడు పట్టాల పంపిణీ తదితర కార్యక్రమాలకు టెంట్ వేసి కుర్చీలు సమకూర్చాడు. ఆరు నెలల కాలంలో రూ.12 వేలు బిల్లు అయింది. డబ్బులు ఇవ్వాలని ఆరు నెలల నుంచి తిరుగుతున్నా రేపు మాపు అంటూ సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి కాలయాపన చేస్తున్నారని జీపీ కార్యాలయం ఎదుట కార్యదర్శి సమక్షంలోనే టెంట్‌ను తగులబెట్టాడు. టెంట్ సామగ్రి వాడుకుని డబ్బులు ఇవ్వమంటే పదే పదే తిప్పించుకోవడంపై నిరసనగా టెంట్ దహనం చేశానని రవి ఆవేదన వ్యక్తం చేశాడు. కార్యదర్శి మీనాకుమారిని వివరణ కోరగా చెక్కు సిద్ధంగా ఉందని, దానిపై సర్పంచ్, ఉపసర్పంచ్‌లు సంతకం చేయలేదని తెలిపారు.

గ్రామాల్లో డీఎల్‌పీఓ విచారణ

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఆసుపాక, జమ్మిగూడెం గ్రామ పంచాయతీల్లో మంగళవారం డీఎల్‌పీఓ రాజీవ్‌కుమార్ విచారణ చేపట్టారు. ఆయా గ్రామ పంచాయతీల్లో నిధులు దుర్వినియోగం అయినట్లు పంచాయతీ పాలక వర్గాలు కొద్ది రోజుల కిందట ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులపై డీఎల్‌పీఓ ఆయా పాలకవర్గ బాధ్యుల నుంచి లిఖిత పూర్వకంగా వివరాలు సేకరించారు. అనంతరం రికార్డులను స్వాధీనం చేసుకున్నారు.

పెంపుడు కుక్క విషయంలో ఘర్షణ

భద్రాచలంఅర్బన్: పెంపుడు కుక్క విషయంలో రెండు కుటుంబాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పట్టణంలోని భగవాన్‌దాస్‌కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న నాని ఇంటికి పక్కనే ఉంటున్న ప్రసాద్‌కు చెందిన పెంపుడు కుక్క ఈ నెల 16న వెళ్లింది. ఈ క్రమంలో నాని, అతడి కుటుంబ సభ్యులు ప్రసాద్ ఇంటికి వెళ్లి దూషించడమే కాకుండా దాడి చేశారు. గొడవను ఆపేందుకు ప్రయత్నించిన కాలనీవాసి కోటయ్యను, నాని ఇంటి యజమాని సత్తిబాబుపై కూడా దాడి చేశారని ప్రసాద్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. ఏఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేశారు.

చెట్టును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



చెట్టును ఢీకొని ఆగిన బస్సు

అశ్వాపురం: మండలంలోని జగ్గారం క్రాస్ రోడ్డు వద్ద మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మంగళవారం చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మణుగూరు డిపోకు చెందిన బస్సు మణుగూరు నుంచి ఖమ్మం వెళ్తోంది. జగ్గారం క్రాస్ రోడ్డు సమీపంలో మణుగూరు – కొత్తగూడెం ప్రధాన రహదారిపై బస్సుకు ఎద్దు అడ్డు రావడంతో తప్పించబోయి అదుపుతప్పి రహదారి కిందకు దిగి చెట్టును ఢీకొట్టింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులెవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

న్యాయం చేయాలని ఫిర్యాదు

భద్రాచలంఅర్బన్: న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం ఓ వివాహిత పోలీసులను ఆశ్రయించింది. వివరాలిలా ఉన్నాయి. నాలుగేళ్లుగా పట్టణంలోని కొత్తపేటకు చెందిన కొక్కెరపాటి మనోజ్‌కుమార్‌తో కమలిని స్వప్నిక సహజీవనం చేసింది. పెళ్లి చేసుకునే క్రమంలో అత్తింటి వారు అడిగిన విధంగా 12 తులాల బంగారు ఆభరణాలు, కేజీ వెండి, రూ.4 లక్షల ఫర్నిచర్, రూ.28 లక్షల నగదుతో పాటు రూ.1,78,000 విలువైన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, సెల్‌ఫోన్, ఇతర గృహోపకరణాలను స్వప్నిక కుటుంబ సభ్యులు ముట్టజెప్పారు. ఆడబిడ్డల కట్నం కింద ఇద్దరు ఆడబిడ్డలకు రూ.50 వేలు ఇచ్చారు. గత మే 21న వివాహం కాగా, నూతన గృహానికి మారారు. ఈ క్రమంలో గత జూన్ 12న మనోజ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. భర్త పోయిన బాధలో ఉండగా అత్తింటివారు స్వప్నికను వేధించడం ప్రారంభించారు. తన భర్త బైక్ దాచిపెట్టారని, ఇంటి పత్రాలు లాక్కున్నారని, తన వల్లే మనోజ్‌కుమార్ చనిపోయాడని అత్త ధనలక్ష్మి, ఆడపడుచులు స్పందన, అలుగూరి నవ్య, వారి భర్తలు రాము, అలుగూరి వీరభద్రం చిత్రహింసలు పెడుతున్నారని స్వప్నిక ఫిర్యాదులో పేర్కొంది. ఏఎస్‌ఐ అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కానిస్టేబుల్‌ను గాయపర్చిన వ్యక్తి అరెస్ట్

కొత్తగూడెంఅర్బన్: త్రీటౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్‌ను గాయపరిచిన వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. టేకులపల్లి మండలానికి చెందిన మాలోత్ అశోక్‌బాబు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు దొరికాడు. ఆల్కహాల్ శాతాన్ని పరీక్షిస్తున్న కానిస్టేబుల్‌ను అశోక్‌బాబు తోసేయగా అతడికి గాయాలయ్యాయి. త్రీటౌన్ పోలీసులు అదేరోజు అశోక్‌బాబుపై కేసు నమోదు చేసి మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

ప్లాంటేషన్ ధ్వంసం చేసిన వారిపై కేసు

చంద్రుగొండ: మండలంలోని రామవరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో ఉన్న జామాయిల్ ప్లాంటేషన్ ధ్వంసం చేసిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు రేంజర్ ఉమా తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తిప్పనపల్లి బీట్ కంపార్ట్‌మెంట్–13లో తిప్పనపల్లితండాకు చెందిన సుమారు 40 మంది గిరిజనులు ప్లాంటేషన్‌లో అక్రమంగా చొరబడి సుమారు పది హెక్టార్లలో మొక్కలు నరికేశారన్నారు. రూ.10 లక్షల వరకు నష్టం జరిగిందని తిప్పనపల్లి బీట్ అధికారి సుమన్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

పామాయిల్ గెలల చోరీపై..

అశ్వారావుపేటరూరల్: ఓ రైతుకు చెందిన పామాయిల్ తోటలో గెలలు చోరీకి గురికాగా.. ఆలస్యంగా ఏడుగురిపై మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీకి చెందిన గేదల విష్ణుమూర్తికి చెందిన పామాయిల్ తోటలో ఇరవై రోజుల కిందట సుమారు రూ.70 వేల విలువైన గెలలు చోరీకి గురయ్యాయి. గెలలను సరిహద్దు పొలానికి చెందిన రైతు మంగరాజు సహకారంతో ఏపీలోని పశ్చిమ గోదావరి జిల్లా దేవరపల్లి మండలం యాదఓలు గ్రామస్తులు పి.శ్రీహరి, బి.సత్యనారాయణ, బి.సత్యవతి, పి.త్రిమూర్తులు, బి.ప్రసాద్, ఎం.సుబ్బారాజు కలిసి నరికి తీసుకెళ్లినట్లు బాధితుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఏడుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మహిళ, యువతి అదృశ్యంపై..

ఇల్లెందు: మండలంలోని మసివాగు, పూబెల్లి గ్రామాలకు చెందిన మహిళ, యువతి అదృశ్యంపై కేసులు నమోదు చేశామని ఇల్లెందు సీఐ కరుణాకర్ తెలిపారు. మసివాగు గ్రామానికి చెందిన 35 ఏళ్ల మహిళ ఈ నెల 10న ఇల్లెందుకు కూరగాయల కోసం వెళ్లి ఇంటికి తిరిగి రాలేదని భర్త రవీందర్ ఫిర్యాదు చేశారు. పూబెల్లి గ్రామానికి చెందిన 17 ఏళ్ల యువతి సోమవారం అర్ధరాత్రి ఇంటి నుంచి పారిపోయినట్లు తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. రెండు ఘటనలపై విచారించి కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ముగ్గురు విలేకరులు, ఎడిటర్లపై..

అశ్వారావుపేటరూరల్: ముగ్గురు విలేకరులతోపాటు మరో ముగ్గురు ఎడిటర్లపై అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. స్థానిక ఎస్సై బి.రాజేశ్ కుమార్ కథనం ప్రకారం.. అశ్వారావుపేటలోని షిరిడీ సాయి నగర్‌కు చెందిన పేరం వెంకటలక్ష్మి అనే మహిళ కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగాల పేరుతో కొంత మంది నిరుద్యోగుల నుంచి లక్షలాది రూపాయాలు వసూలు చేసిందంటూ గతేడాది ఆగస్టు 22న ఓ దినపత్రిక(సాక్షి కాదు)తో పాటు, రెండు ఎలక్ట్రానిక్ మీడియా చానళ్లలో కథనాలు వెలువడ్డాయి. దీంతో తన పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించారంటూ వెంకటలక్ష్మి కొత్తగూడెం కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేసింది. దీనిపై కోర్టు ఆదేశాలతో బాధితురాలి నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకొని, ముగ్గురు విలేకరులు, ముగ్గురు ఎడిటర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళపై లైంగికదాడి

పాల్వంచ: లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన మహిళపై సదరు ద్విచక్రవాహనదారుడు నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలో సోమవారం రాత్రి 10 గంటల సమయంలో ఓ మహిళ బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లిఫ్ట్ అడిగి ఎక్కింది. లిఫ్ట్ ఇచ్చిన వ్యక్తి ఆమెను మాటల్లో పెట్టి నిర్మానుష్య ప్రాంతం రాగానే ఆమెపై లైంగికదాడి చేశాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేశారు.

జోరు వానలో వాగు దాటి..

గిరిజనులకు వైద్య పరీక్షలు



వాగు దాటుతున్న వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు

అశ్వారావుపేటరూరల్: ఎడతెరిపిలేకుండా కురిసిన జోరు వర్షంలోనూ వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు, సిబ్బంది తమ విధులు నిర్వర్తించారు. ఓ వాగు దాటి వెళ్లి గిరిజన గ్రామస్తులకు మంగళవారం వైద్య సేవలు అందించారు. మండలంలోని వినాయకపురం పీహెచ్‌సీ పరిధిలోగల దిబ్బగూడెం (దురదపాడు) గ్రామానికి వెళ్లాలంటే మధ్యలో ఉన్న వాగును దాటాల్సి ఉంది. జోరుగా కురుస్తున్న వర్షంలోనే 12 మంది వైద్య సిబ్బంది ఈ గ్రామానికి వెళ్లారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే చేసి వివరాలను నమోదు చేశారు. ఈ సర్వేలో జ్వరాలతో బాధ పడే వారిని గుర్తించి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి ఆజ్మీర వెంకటేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, హెచ్‌ఈఓ రాజు, సిబ్బంది గోపాల్, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల ఆందోళన

ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించిన సిబ్బంది



పాల్వంచలో ఎమ్మెల్యే వనమా ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న పంచాయతీ కార్మికులు



ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు, నాయకులు

పాల్వంచ/ ఇల్లెందురూరల్: పంచాయతీ కార్మికుల సమ్మెలో భాగంగా మంగళవారం ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడించారు. పాత పాల్వంచలోని వనమా వెంకటేశ్వరరావు ఇంటితో పాటు ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ క్యాంప్ కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు ఏజే రమేష్, నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులు 12 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామాల్లో చెత్త పేరుకుపోయి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, తక్షణమే కార్మికులతో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే వనమా హామీ ఇచ్చారు. ఇల్లెందులో ఎమ్మెల్యే హరిప్రియ మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే కార్మికులు అడగకుండానే వారి సేవలను మెచ్చి ఇటీవలే రూ.1000 వేతనం పెంచిందని గుర్తుచేశారు. వెసులుబాటును బట్టి మరోసారి వేతనం పెంచాలని తాను కూడా ప్రభుత్వాన్ని కోరతానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వాసిరెడ్డి మురళి, వీసంశెట్టి పూర్ణచందర్ రావు, రవి, యూసుఫ్, అమర్‌నాథ్, కిశోర్, సురేశ్, శ్రీను, మంజుల, భిక్షం, సీహెచ్.శ్రీను, ఎస్.పూర్ణచందర్ రావు, గౌని నాగేశ్వరరావు, తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి, యాకూబ్ షావలి, బిల్లకంటి సూర్యం, రాంసింగ్, పులి సైదులు, నబి, బందం నాగయ్య, శంకర్ పాల్గొన్నారు.

జీకేఓసీలో మద్యం కలకలం


విధుల్లో ఉండి మద్యం సేవించిన పలువురు?

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని జీకేఓసీలో కొందరు ఉద్యోగులు ఆదివారం ప్లేడే రోజు డ్యూటీ సమయాన మద్యం సేవించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సింగరేణిలో వారంలో నాలుగు రోజులు మస్టర్ ఉన్న కార్మికులకు అవసరానికి అనుగుణంగా ప్లేడే (ఒక రోజు డ్యూటీ చేస్తే రెండు మస్టర్లు) ఇచ్చే సంప్రదాయం కొన్నేళ్లుగా ఉంది. అయితే, ఆదివారం మాత్రం కొందరు అత్యవసర విభాగాల వారికి యాజమాన్యమే విధులు కేటాయిస్తుంది. ఈ నేపథ్యాన ఆదివారం డ్యూటీకి వచ్చిన ఒక నాయకుడు సహా కొందరు ఉద్యోగులు మధ్యాహ్నం మద్యం సేవించినట్లు సమాచారం. ఈ విషయమై గని మేనేజర్ మురళి విచారణ చేపట్టినట్లు తెలిసింది. గతంలో ఇదే ఓసీ వద్ద ఓ అధికారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో ఉద్యోగులు మద్యం సేవించగా గొడవ జరగడంతో పలువురిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. అప్పటినుంచి గని ఆవరణలో మద్యం, విందును నిషేధించగా, 16వ తేదీన మాత్రం బేసిక్ వర్క్‌షాపులో మందు, విందు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఈ విషయమై ఏరియా జనరల్ మేనేజర్ శాలేంరాజును వివరణ కోరగా ఘటనపై విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా...

‘షెడ్యూల్ 5’పై ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

తదుపరి విచారణ 4 వారాలకు వాయిదా



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో షెడ్యూల్ 5 అమలుకు సంబంధించి దాఖలైన పిటిషన్‌లో కౌంటర్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం...జెడ్పీటీసీ, డైరెక్టర్లు, కో–ఆపరేటివ్ చైర్మన్లు సహా అన్ని పోస్టులను గిరిజనులకే కేటాయించాలని, ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ కొత్తగూడెం జిల్లాకు చెందిన లంబాడి హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి భూక్యా దేవనాయక్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై తాత్కాలిక ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. రాష్ట్రంలో 12% గిరిజన జనాభా ఉందని, సామాజికంగా, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబడిన వీరి అభ్యున్నతి కోసం...గిరిజన ప్రాంతాల్లో వారినే స్థానిక సంస్థలు, ఇతర పదవుల్లో నియమించాలని పిటిషనర్ న్యాయవాది వాదనలు వినిపించారు. వాదనలు విన్న ధర్మాసనం ...ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, గిరిజన సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి, కమిషనర్లకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

వర్సిటీల పాలకమండలి సభ్యుల పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని తొమ్మిది విశ్వవిద్యాలయాలకు సంబంధించిన క్లాస్–2 పాలక మండలి సభ్యుల పదవీ కాలాన్ని మరో ఏడాది పెంచుతూ మంగళవారం విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి పదవీ కాలం ఏప్రిల్‌తో ముగియడంతో..పాలకమండలి సభ్యులుగా యూనివర్సిటీకి చెందిన సీనియర్ ప్రొఫెసర్, ప్రిన్సిపల్, ప్రభుత్వం నామినేట్ చేసే ముగ్గురు సభ్యులు ఉంటారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయులకు 14 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వివిధ రకాల బిల్లులను తక్షణమే మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని పీఆర్‌టీయూటీఎస్ డిమాండ్ చేసింది. ఆ సంఘం అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ఈమేరకు ప్రభుత్వానికి లేఖ రాశారు.

ఏపీ విద్యా విధానాలపై ఐరాస అభినందనలు

బాలికా విద్యకు ఏపీ సీఎం జగన్ ప్రోత్సాహం బాగుంది

ఐరాస లక్ష్య సాధనకు కృషి చేస్తున్నారని ప్రశంసలు



నాడు-నేడు స్టాల్‌ను సందర్శించిన ఐక్యరాజ్యసమితి ఎకనామిక్ అండ్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్

సాక్షి, అమరావతి: ఐక్యరాజ్య సమితి లక్ష్యాలైన అందరికీ విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం నవరత్నాలు, నాడు – నేడు, సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఐరాస ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ప్రశంసించారు. ఐరాస ప్రధాన కార్యాలయమైన న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక మండలి నేతృత్వంలో సుస్థిరాభివృద్ధిపై జూలై 17న జనరల్ అసెంబ్లీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు, విద్యారంగంలో పథకాలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యాకానుక కిట్లు, విద్యా దీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యార్థులకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్మార్ట్ బోర్డ్స్, బైజూస్ ట్యాబ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విద్యారంగ సంస్కరణలు, వివిధ పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న తీరు, డిజిటల్ బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్ గురించి వివరించారు. నాడు – నేడు స్టాల్‌ని సందర్శించిన ఎకనామిక్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టోఫెల్ ట్రైనింగ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ డిక్షనరీలు, గోరుముద్ద, ఆణిముత్యాల పథకాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేద విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షకిన్ కుమార్ ఆమెకు వివరించారు. డిజిటల్ ఇండియా దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు.

ఏపీ స్టాల్‌పై పలు దేశాల ఆసక్తి

టాంజానియా ఆర్థిక శాఖా మంత్రి నటూ వాంబా ఏపీ స్టాల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని అభినందించారు. అమెరికా పర్మినెంట్ అబ్జర్వర్ మిషన్ టూ యునైటెడ్ నేషన్స్ ప్రొఫెసర్ ఒట్టో ఫీజిన్ బ్లాట్, అమెరికన్ డిప్లొమాటిక్ అకాడమి రిప్రజెంటేటివ్ టు యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ బిల్ గ్రాహమ్ తదితరులు ఏపీ విద్యా విధానాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో సునీత చిట్టామూరి తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన వైద్యుల పదోన్నతులు

- పదోన్నతుల ప్రక్రియలో ఉద్రిక్తత
- ఖాళీలను చూపకపోవడంపై డాక్టర్ల అభ్యంతరం.. డీఎంఈ కార్యాలయంలో నిలిచిన కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లను అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించేందుకు నిర్వహించే కౌన్సెలింగ్ ప్రక్రియలో మంగళవారం ఉద్రిక్తత నెలకొంది. వైద్యుల ఆందోళనలతో కౌన్సెలింగ్ నిలిచిపోయింది. తదుపరి కౌన్సెలింగ్ ఎప్పుడన్న అంశంపై అధికారులు స్పష్టత ఇవ్వలేదు.

- రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ మెడికల్, డెంటల్ కాలేజీల్లో పనిచేస్తున్న క్లినికల్, నాన్ క్లినికల్, సూపర్ స్పెషాలిటీస్ సహా డెంటల్ అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పిస్తూ వైద్య విద్యా సంచాలకుడు(డీఎంఈ) డాక్టర్ రమేశ్‌రెడ్డి ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. మొత్తం 190 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పిస్తూ జాబితా విడుదల చేశారు. వారికి మంగళవారం ఉదయం 10 గంటలకు డీఎంఈ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కానీ ఖాళీలన్నీ చూపకుండా కేవలం అభ్యర్థుల సంఖ్య ప్రకారమే చూపడంపై విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర స్థాయిలో 900 ఖాళీలుండగా, అభ్యర్థుల సంఖ్య ప్రకారమే ఖాళీలు చూపించడం ఏంటని డాక్టర్లు ప్రశ్నించారు. కేవలం తెలంగాణ వచ్చిన తర్వాత ఏర్పడిన కొత్త కాలేజీల్లోనే ఖాళీలు చూపించారని, పాత కాలేజీల్లో ఎందుకు చూపడం లేదని నిలదీశారు. ఉస్మానియా, గాంధీ వంటి మెడికల్ కాలేజీల్లో ఉన్న అన్ని ఖాళీలు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు.దీనిపై ఉద్రిక్తత నెలకొనడంతో కౌన్సెలింగ్ వాయిదా పడింది.

ఖాళీలను చూపిస్తే హైదరాబాద్‌కే ప్రాధాన్యం..

అన్ని కాలేజీల్లో ఖాళీలను చూపిస్తే పదోన్నతులు పొందిన వారంతా కూడా హైదరాబాద్ లేదా సమీపంలోని మెడికల్ కాలేజీలకే ప్రాధాన్యం ఇస్తారని డీఎంఈ వర్గాలు చెబుతు న్నాయి. కొత్త కాలేజీలకు అసోసియేట్ ప్రొఫెసర్ల అవసరం చాలా ఉందని, దాంతో వాటిని ప్రభుత్వం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని నిర్ణయించినట్టు చెబుతున్నారు.

అందరూ అలానే అడగరంటున్న వైద్యుల సంఘం

అందరూ ఉస్మానియా, గాంధీ మెడికల్ కాలేజీలనే అడగడం లేదని, అన్ని అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలు చూపిస్తే వచ్చే నష్టమేమి లేదని తెలంగాణ బోధనా ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి జలగం తిరుపతిరావు, ఉపాధ్యక్షుడు డాక్టర్ కిరణ్ మాదల అంటున్నారు.

నిబంధనల మేరకే కౌన్సెలింగ్

జాతీయ మెడికల్ కమిషన్ (ఎన్‌ఎంసీ) నిబంధనల ప్రకారం కొత్త మెడికల్ కాలేజీలలో పోస్టుల భర్తీకి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని డీఎంఈ రమేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కళాశాలల్లో అభ్యర్థుల లభ్యత, అవసరాల ఆధారంగా ఖాళీల మ్యాట్రిక్స్ తయారు చేశామన్నారు. కొందరు అనవసరంగా గందరగోళం సృష్టించి కౌన్సెలింగ్ ప్రక్రియను అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం వివిధ జిల్లాల్లోని కాలేజీల్లో సేవలు చేయాలని కోరుకుంటోందన్నారు.

ఉస్మానియాలో జనరల్ సర్జరీలో 31 మంది, పీడియాట్రిక్స్‌లో 55 మంది, ఓబీజీలో 55 మంది, ఆర్థోలో 19 మంది, అనస్థీషియాలో 25 మంది, జనరల్ మెడిసిన్‌లో 27 మంది, గాంధీలో 23 మంది జనరల్ మెడిసిన్, 26 మంది జనరల్ సర్జరీ, 31 మంది అనస్థీషియా ఫ్యాకల్టీలున్నారని వివరించారు. మిగిలిన చోట్ల నింపాల్సిన అవసర ముందన్నారు. నిలిచిన కౌన్సెలింగ్ ప్రక్రియపై ప్రభుత్వంతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామని రమేష్ రెడ్డి వివరించారు.

‘మార్గదర్శి’ కేసు విచారణ వాయిదా

- 56 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు అందజేసిన సంస్థ
- అన్ని పక్షాలు రెండు పేజీల నోట్ దాఖలు చేయండి
- సెప్టెంబరు 26కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు



సాక్షి, న్యూఢిల్లీ : ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 72 వాల్యూమ్‌లతో 56వేల పేజీల డిపాజిటర్ల వివరాలను సంస్థ మంగళవారం కోర్టుకు అందజేయగా దానిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసే అర్హతలేదని సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది హరీశ్ సాల్వే ఆరోపించారు. దీన్ని పార్టీ ఇన్‌పర్సన్ ఉండవల్లి అరుణ్ కుమార్, న్యాయవాది రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ విభేదించారు. ఏపీ, తెలంగాణ ఇద్దరినీ పార్టీ చేసినట్లు ఉండవల్లి కోర్టుకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం రిజాయిండరు దాఖలు చేసినట్లు వైద్యనాథన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని తదుపరి విచారణలోగా అన్ని పార్టీలు ప్లీడింగ్స్ పూర్తిచేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. ఈలోగా 2 పేజీల నోట్ సమర్పించాలని అన్ని పక్షాలను కోర్టు ఆదేశించింది.

ఏపీ పిటిషన్ మరో ధర్మాసనానికి..

మరోవైపు.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించిన కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టిల ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను తాను సభ్యుడుగా లేని ధర్మాసనం ముందు జాబితా చేయాలని జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది.

11 ఎకరాలు ఎలా కేటాయించారు?

- కోకాపేటలో విలువైన భూమిని కేబినెట్ అనుమతి లేకుండానే అధికారపార్టీకి కట్టబెట్టారా?
- ప్రభుత్వానికి, బీఆర్‌ఎస్ పార్టీకి హైకోర్టు నోటీసులు
- కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం.. విచారణ వాయిదా

సాక్షి, హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట సర్వే నంబర్ 239, 240లో అత్యంత విలువైన 11 ఎకరాల భూమిని భారత రాష్ట్ర సమితి(బీఆర్‌ఎస్)కు కేటాయించడంపై రాష్ట్ర ప్రభుత్వానికి, ఆ పార్టీకి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. కేబినెట్ అనుమతి లేకుండానే కేటాయించారా అని ప్రశ్నించింది. కేటాయింపుపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 16కు వాయిదా వేసింది. బీఆర్‌ఎస్‌కు 11 ఎకరాల కేటాయింపును సవాల్ చేస్తూ ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎన్‌జీవో) కార్యదర్శి ఎం.పద్మనాభరెడ్డి హైకోర్టులో పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎకరం దాదాపు రూ.50 కోట్ల మార్కెట్ విలువైన స్థలాన్ని.. కేవలం రూ.3,41,25,000కే ప్రభుత్వం ముట్టజెప్పిందని.. అలా 11 ఎకరాలకు గానూ దాదాపు రూ.500 కోట్లు ప్రభుత్వానికి నష్టమని పేర్కొన్నారు. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

ఇంకా కేబినెట్ నిర్ణయం తీసుకోలేదన్న ప్రభుత్వం

ప్రభుత్వం తరఫున అడిషనల్ అడ్వొకేట్ జనరల్ (ఏఏజీ) జె.రామచందర్‌రావు వాదనలు వినిపిస్తూ.. కోకాపేట్‌లోని 11 ఎకరాల స్థలాన్ని బీఆర్‌ఎస్ కార్యాలయ నిర్మాణానికి కేటాయించడంపై కేబినెట్ ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. కేబినెట్ నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రొసీడింగ్ కాపీని పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచుతామని చెప్పారు. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది సత్యంరెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఎలాంటి టెండర్లు లేకుండానే బీఆర్‌ఎస్ పార్టీకి అత్యంత విలువైన ప్రాంతంలో భూమిని ప్రభుత్వం కేటాయించిందన్నారు. భూమి కేటాయించి.. నిర్మాణం చేపట్టినా ఇప్పటివరకు పబ్లిక్ డొమైన్‌లో ఆ వివరాలను ఉంచలేదని సత్యంరెడ్డి వెల్లడించారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ కాపీని అందజేసేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం .. నాలుగు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హెచ్‌ఎండీఏ కమిషనర్, భూ పరిపాలన చీఫ్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో పాటు బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది.

జిల్లా వార్తలు

వర్షంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం



జీకేఓసీలో వెలవెలబోతున్న లోడింగ్ పాయింట్

సింగరేణి(కొత్తగూడెం)/సత్తుపల్లిటౌన్: సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో సోమవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో సుమారు 28 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం వాటిల్లింది. ఏరియాలోని జేవీఆర్ ఓసీలో 20 వేల టన్నులు, కిష్టారం ఓసీలో 5 వేల టన్నులు, జీకేఓసీలో 3 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడిందని సమాచారం. అంతేకాకుండా 90 వేల క్యూబిక్ మీటర్ల ఓబీ వెలికితీత కూడా నిలిచిపోయింది. ఎడతెరిపి లేని వర్షాలతో ఓసీల్లోని హాల్ రోడ్లన్నీ బురదమయం కాగా, ఉత్పత్తి స్తంభించడంతో సీహెచ్‌పీల లోడింగ్ పాయింట్లు వెలవెలబోతున్నాయి.

కొత్త గనుల్లో ఉత్పత్తిపై దృష్టి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని కొత్త గనులకు అనుమతులు సాధించి త్వరలోనే ఉత్పత్తి సాధించేలా కార్యాచరణ సిద్ధం చేసినట్లు ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్ జీఎం కె.సాయిబాబు తెలిపారు. ఇటీవల జీఎంగా విధుల్లో చేరిన ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. తాజాగా జరిగిన బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో కొత్తగూడెం రీజియన్ పరిధి మణుగూరు ఓసీకి కాలపరిమితి మూడేళ్లు ఉండగా, ఇంకా 18 ఏళ్లు పొడిగింపు ఇచ్చారని తెలిపారు. అలాగే, శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కేపీ ఓసీకి కూడా మరో 15 ఏళ్ల పొడిగింపు లభించిందని చెప్పారు. ఇక ఒడిశాలోని నైనీ బ్లాక్‌కు అనుమతులన్నీ రాగానే ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు. ఈ ఆర్థిక సంవత్సరం కొత్త గనులకు అనుమతి, పాత గనులకు పొడిగింపు వస్తే రానున్న ఐదేళ్లలో 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధ్యమవుతుందని జీఎం తెలిపారు.

పర్సనల్ విభాగంలో అధికారుల బదిలీలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాల్లో విధులు నిర్వర్తిస్తున్న పర్సనల్ విభాగం అధికారులను మంగళవారం బదిలీ చేశారు. ఇద్దరు డీజీఎంలు, ఇద్దరు పర్సనల్ మేనేజర్లు, ముగ్గురు డీవైపీఎంలు, ముగ్గురు సీనియర్ పీఓలు, ఒక వెల్ఫేర్ ఆఫీసర్‌ను బదిలీ చేస్తూ యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా అధికారులు ఈనెల 31 లోగా నూతన స్థానాల్లో విధుల్లో చేరాలని సూచించారు. కాగా, ఏరియాల్లో ఏడెనిమిది ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను కార్పొరేట్‌కు బదిలీ చేయాల్సి ఉన్నా.. అలా చేయలేదనే విమర్శలొస్తున్నాయి.

రైళ్ల రద్దుతో సతమతం

- ప్రతీ వారం పొడిగిస్తున్న అధికారులు
- అవస్థలు పడుతున్న జిల్లా ప్రయాణికులు
- బొగ్గు రవాణాపైనే అధికారులపై దృష్టి





కొత్తగూడెం రైల్వేస్టేషన్ (ఇన్‌సెట్) స్టేషన్ నుంచి బయటకు వస్తున్న ప్రయాణికులు (ఫైల్)

కొత్తగూడెంఅర్బన్: పారిశ్రామిక, బొగ్గు గనులకు నిలయమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి రైల్వే శాఖకు ఏటా రూ.కోట్లలో ఆదాయం సమకూరుతోంది. ఇందులో సింహభాగం బొగ్గు రవాణా ద్వారా వస్తోంది. దీనిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్న రైల్వే శాఖ ప్రయాణికుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి. బొగ్గు రవాణాకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్న అధికారులు ప్రయాణికుల గోడు పట్టించుకోవడం లేదు. జిల్లా నుంచి వేలాది మంది నిత్యం కొత్తగూడెం స్టేషన్ నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్, విజయవాడ, కాజీపేట, డోర్నకల్ తదితర ప్రాంతాలకు వచ్చి వెళ్తుంటారు. అయితే, ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా రైళ్లు లేకపోగా.. ఉన్న వాటిని కూడా రద్దు చేస్తుండడం, మిగతావి సరైన సమయానికి నడవకపోవడం ప్రజలను ఇబ్బందికి గురి చేస్తోంది.

మూడు నెలలుగా ఇదే పరిస్థితి..

గత మే నెల నుంచి సాంకేతిక సమస్యలకు తోడు అదనపు రైల్వే లైన్ నిర్మాణ పనులు, ఇతర కారణాలతో కొత్తగూడెం నుంచి నడిచే పలు రైళ్లను రద్దు చేశారు. అయితే, ఈ రద్దు వారం, పది రోజులు ఉంటుందని తొలుత అధికారులు పొడిగించినా ఇప్పటి వరకు పొడిగిస్తూనే ఉన్నారు. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఖర్చు తగ్గడంతో పాటు సౌకర్యంగా ఉంటుందనే భావనతో ఎక్కువ మంది రైలు ప్రయాణానికి మొగ్గు చూపుతారు. కానీ, రైళ్లు నడవకపోవడంతో ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మిగతా అన్ని ప్రాంతాల నుంచి నడిచే రైళ్లను సాఫీగానే నడిపిస్తుండగా.. కొత్తగూడెం నుంచి మొదలయ్యే రైళ్లను మాత్రం రద్దు చేయడంతో బొగ్గుతో వచ్చే ఆదాయంపైనే అధికారులు దృష్టి సారించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా, ప్రస్తుతం విజయవాడ నుంచి భద్రాచలం రోడ్డు వచ్చే రైలు, భద్రాచలం రోడ్డు నుంచి విజయవాడ వెళ్లే రైలు ఈ నెల 23వ తేదీ వరకు రద్దు చేయగా, సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్ వరకు నడిచే రైలును 23వ తేదీ వరకు, భద్రాచలం రోడ్డు నుంచి బల్లార్షా వరకు నడిచే రైలును 24వ తేదీ వరకు రద్దు చేశారు.

ఆలస్యానికి అంతే లేదు..

భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌కు వచ్చివెళ్లే రైళ్ల ఆలస్యంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి కొత్తగూడెంలోని సింగరేణి గనులు, ప్రధాన కార్యాలయం, భద్రాచలంలో శ్రీసీతారామచంద్రస్వామి దర్శనం, కేటీపీఎస్, నవభారత్, మణుగూరు హెవీవాటర్ ప్లాంట్ ఉద్యోగులు ఎక్కువగా వస్తారు. గత నెల రోజులుగా సికింద్రాబాద్ – మణుగూరు మధ్య నడిచే రైలు తెల్లవారుజామున 4.30 గంటలకు కొత్తగూడెం రావాల్సి ఉన్నా, ఉదయం 7 గంటల తర్వాత వస్తోంది. దీంతో ప్రయాణికులు పనులను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అలాగే, కాకతీయ ఎక్స్‌ప్రెస్ కూడా మూడు, నాలుగు గంటలు ఆలస్యంగా నడుస్తోంది. దీంతో గంటల తరబడి అటు సికింద్రాబాద్, ఇటు కొత్తగూడెంలో పిల్లాపాపలతో వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవల వరంగల్ స్టేషన్‌లో కొత్తగూడెం రావాల్సిన పలువురు వేచి ఉండగా వాటర్ ట్యాంకు, షెడ్ కూలడంతో కొందరికి గాయాలయ్యాయి.

ప్రయాణికులనూ పట్టించుకోవాలి..



భద్రాచలం రోడ్డు స్టేషన్ ద్వారా రైల్వే శాఖకు ఆదాయం అధికంగానే వస్తోంది. అయితే, రైల్వే అధికారులు కేవలం బొగ్గు రవాణాపై మాత్రమే దృష్టి సారించారు తప్ప ప్రయాణికులను పట్టించుకోవడం లేదు. మే నెల నుంచి రైళ్ల రద్దు, మిగతా రైళ్లు ఆలస్యంగా నడుస్తుండడంతో ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇకనైనా అన్ని రైళ్ల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలి.

–కొదమసింహం పాండురంగాచార్యులు, కన్వీనర్, కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ

పోడు భూములన్నింటికీ పట్టాలు ఇవ్వాల్సిందే..

ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి రంగారావు



సదస్సులో మాట్లాడుతున్న పోటు రంగారావు

ములకలపల్లి: పోడు భూములను సాగు చేసుకుంటున్న అందరికీ పట్టాలు వచ్చే వరకు పోరాడుతామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు వెల్లడించారు. మండల కేంద్రంలో పార్టీ పాల్వంచ డివిజన్ కార్యదర్శి గోకినేపల్లి ప్రభాకర్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగుదారుల్లో కొందరికి నామమాత్రంగా పట్టాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుందని విమర్శించారు. ఈ విషయమై అధికార పార్టీ నాయకులను గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. పోడు సాగుచేసుకుంటున్న పేద గిరిజనేతరులు, గొత్తికోయలకు కూడా హక్కు పత్రాలను ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం పోడు సాగుదారులతో కలిసి ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి కెచ్చెల రంగారెడ్డి, నాయకులు ముద్దా భిక్షం, అమర్లపూడి రాము, భాస్కర్, కల్లూరి కిశోర్, పోతుగంటి లక్ష్మణ్, నిమ్మల రాంబాబు, కల్లయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో అగ్రస్థానమే లక్ష్యం

- రైతులకు అన్ని విధాలుగా సహకరిస్తాం
- ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి



అప్పారావుపేట ఫ్యాక్టరీలో విస్తరణ పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రామకృష్ణారెడ్డి

అశ్వారావుపేటరూరల్/దమ్మపేట: ఆయిల్‌పామ్ సాగులో రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా కొత్తగా 16 వేల ఎకరాల్లో తోటలను విస్తరిస్తున్నట్లు ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. అశ్వారావుపేట మండలం పండువారిగూడెంలో రైతు నడింపల్లి శివరామరాజు 54 ఎకరాల్లో పామాయిల్ సాగు చేసేందుకు ముందుకు రావడంతో చైర్మన్ మొక్క నాటి మాట్లాడారు. ఈ ఏడాది జిల్లాలో 2వేల ఎకరాలకు సరిపడా మొక్కలను అందించామని, తోటల విస్తరణకు ఆయిల్‌ఫెడ్ ద్వారా రైతులకు అన్నివిధాలుగా సహకరిస్తున్నామని తెలిపారు. మొక్కల కోసం రైతులు ఆందోళన చెందొద్దని, దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని సూచించారు. పట్టా భూములతోపాటు ప్రభుత్వం కొత్తగా పాస్‌పుస్తకాలు ఇచ్చిన పోడు పట్టాదారులకు కూడా మొక్కల్ని అందజేస్తామని చెప్పారు. అలాగే, దమ్మపేట మండలంలో కూడా ఆయిల్‌ఫెడ్ చైర్మన్ కంచర్ల రామకృష్ణారెడ్డి పర్యటించారు. లింగాలపల్లిలోని గొర్రెగుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజలు చేశాక, తాటిసుబ్బన్నగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తర్వాత అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ విస్తరణ పనులను పరిశీలించి సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమాల్లో పామాయిల్ ఫ్యాక్టరీల మేనేజర్లు ఆకుల బాలకృష్ణ, కల్యాణ్, నాగబాబు, ఫీల్డ్ ఆఫీసర్లు శ్రీకాంత్, చందు, రైతు సంఘం నాయకుడు చీమకుర్తి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా, అశ్వారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ విస్తరణ, అదనపు నిర్మాణంలో భాగంగా బాయిలర్ ఏర్పాటుకు బుధవారం భూమి పూజ చేయనున్నట్లు ఫ్యాక్టరీ మేనేజర్ ఆకుల బాలకృష్ణ తెలిపారు.

గోదావరి కరకట్ట పటిష్టతకు చర్యలు



కరకట్టపై ఇసుక బస్తాలు పేరుస్తున్న కూలీలు

చర్ల: గత ఏడాది గోదావరికి వరద రావడంతో ఇబ్బందులు ఎదురైన దృష్ట్యా జల వనరుల శాఖ అధికారులు ఈసారి ముందస్తు చర్యలు చేపట్టారు. దుమ్ముగూడెంలో బలహీనంగా ఉన్న గోదావరి కరకట్ట హెడ్‌లాక్‌ల వద్ద, మరికొన్ని ప్రాంతాల్లో మంగళవారం ఇసుక బస్తాలను పేర్చారు. గత ఏడాది కూడా లీక్ కావడంతో అప్పటికప్పుడు ఇసుక బస్తాలు ఏర్పాటు చేసి వరదనీరు రాకుండా చర్యలు చేపట్టారు. అలాంటి పరిస్థితి రావొద్దని ఈసారి కరకట్టకు మూడు చోట్ల తూముల వద్ద 1,500 ఇసుక బస్తాలను సిద్ధం చేయగా పనులను ఇరిగేషన్ ఏఈ సుజ్ సుహాన్, మస్తాన్ వీబేగ్ పర్యవేక్షించారు.

అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించారు



మాట్లాడుతున్న ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి మధు

ఇల్లెందు: దరఖాస్తు చేసుకున్న 11 లక్షల మంది పోడు సాగుదారులకు పట్టాలిస్తామని చెప్పిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు 4 లక్షల మందికే పట్టాలివ్వటం అటవీ హక్కుల చట్టాన్ని ఉల్లంఘించడమేనని న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు ఆవునూరి మధు ఆరోపించారు. ఇల్లెందులోని ఎన్డీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ పంపిణీ చేసిన పట్టాల్లోనూ అవకతవకలు జరిగాయని ఆరోపించారు. గుండాల మండలం లక్ష్మీపురంలో ఓ రైతు రెండు చోట్ల పది ఎకరాలకు దరఖాస్తు చేసుకుంటే ఒకే చోట పట్టా ఇచ్చి వదిలేశారని తెలిపారు. అలాగే, ఛత్తీస్‌గఢ్ వలస ఆదివాసీలకు పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. ఇకనైనా అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన పోడు సాగుదారులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతేకాక గిరిజనులు, గిరిజనేతరుల మధ్య ఘర్షణ సృష్టించేందుకు యత్నిస్తున్న అధికార పార్టీ నేతలు తీరు మార్చుకోవాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సమస్య పరిష్కారం కోసం బుధవారం ఇల్లెందు మండలం మాణిక్యారంలో జిల్లా స్థాయి సభ, 22 నుంచి 30వ తేదీన వరకు గ్రామాల్లో జీపు జాతాలు, 31న ఐటీడీఏ ముట్టడి చేపడుతున్నట్లు మధు తెలిపారు. ఈసమావేశంలో నాయకులు తుపాకుల నాగేశ్వరరావు, పొడుగు నర్సింహారావు, తోడేటి నాగేశ్వరరావు, చింత నర్సింహారావు, కోడి శ్రీరాములు, అంజన్న, జోగ కృష్ణ, మూడు మాలు, ఈసాల పాపక్క, చింత రజిత, వాంకుడోతు శ్రీను, బానోతు సంతు, మోకాళ్ల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.